క్లుప్తంగా

ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి శివారు బురదపేటలో ఆదివారం జరిగిన ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, పరవాడ వైస్ ఎంపీపీ బి.నాగేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ నాయకులు వెన్నల సన్యాసి రావు, బురదరాజు, కూండ్రపు తాతాజీ, పెదిశెట్టి శేఖర్, గొర్లి గోపి, గోవిందు, కృష్ణబాబు, హేమచంద్‌నాయుడు, చరణ్‌రాజ్ తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం



అన్నదానం బాండ్ అందుకుంటున్న దాత అమిత్‌కుమార్‌జైన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి విజయనగరానికి చెందిన అమిత్‌కుమార్‌జైన్ అనే దాత లక్ష 11 వేల 116 రూపాయల విరాళమిచ్చారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందించారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: అక్షయ ఆశ్రయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనగర్లో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరాలకు చక్కటి స్పందన లభించింది. శిబిరంలో 400 మందికి జనరల్ వైద్య పరీక్షలతో పాటు దంత, నేత్ర, చిన్న పిల్లల వైద్య నిపుణులు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ శిబిరాల్లో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ధ్యాన కేంద్రం ప్రతినిధులు

పెందుర్తి: శాకాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్ర ప్రతినిధి సదరం లక్ష్మి అన్నారు. ఆదివారం ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ హింస మానుకుని ప్రతి ఒక్కరూ జంతుజాలాన్ని రక్షించాలన్నారు. మాంసాహారానికి దూరంగా ఉండడంతో పాటు నిరంతరం ధ్యాన సాధన చేస్తే మానసికంగా, శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ధ్యాన కేంద్ర ప్రతినిధులు బుజ్జి, సతీష్, శరగడం తులసి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణంపై దాడి.. అరెస్ట్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని ముత్యమాంబ కాలనీలో మద్యం బెల్ట్ దుకాణంపై పెందుర్తి పోలీసులు ఆదివారం దాడి చేశారు. దుకాణం నిర్వహిస్తున్న పంపాన భావన రుషి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్దనున్న 8 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు కొనసాగుతాయని సీఐ స్పష్టం చేశారు. ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదిశేషుడిపై కొలువుండే వైకుంఠవాసుడికి ప్రత్యేక నివాసమెందుకనుకున్నారో.. ఏమో..! శతాబ్దాల చరిత్ర కలిగిన స్వామికి దశాబ్దాల తరబడి నిలువనీడ లేకుండా చేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయంతోపాటు, విగ్రహాలను కూడా మూలకు చేర్చారు. దాతల చొరవతో శ్రీదేవి, భూదేవి సమేతంగా వైకుంఠవాసుడి విగ్రహాలు కొత్తగా కొలువుదీరాయి. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చినా.. ప్రణాళికల పేరిట సింహాచల దేవస్థానం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారే తప్ప.. కార్యాచరణ శూన్యం.

దయనీయం.. వైకుంఠ నివాసం

- నాలుగు రాతి స్తంభాలు, రేకుల పైకప్పే గతి
- నాడు ఎంతో వైభవం.. నేడు అంతే దైన్యం
- నూతన ఆలయ నిర్మాణానికి దాతలు సిద్ధం
- ప్రణాళికల్లోనే సింహాచల దేవస్థాన యంత్రాంగం



రేకుల షెడ్‌లో కొలువుదీరిన వైకుంఠవాసుడు

సింహాచలం: సింహగిరిపై శతాబ్దాల చరిత్ర కల్గిన వైకుంఠవాసుడి ఆలయం దీనావస్థలో ఉంది. స్వామివారి ఆలయాన్ని ఎప్పుడు అభివృద్ధి చేస్తారా... అని భక్తులు ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు ఘన వైభవం కలిగి.. నేడు ధూపదీప నైవేద్యాలకూ నోచుకోని ఆలయాన్ని అభివృద్ధి చేసి పునర్వైభవం తీసుకొస్తామన్న సింహాచలం దేవస్థానం అధికారుల మాటలు నీటి మూటలుగానే మారుతున్నాయి. దాతలు ముందుకొస్తున్నా.. ఏళ్లతరబడి ప్రణాళికలతోనే సరిపుచ్చుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వరద పాయసంతో సరిపెడుతున్నారు!

సింహగిరిపై మైక్రోటవర్‌కి వెళ్లే మార్గంలో ఎత్తైన కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వైకుంఠవాసుడు కొలువుదీరి ఉన్నాడు. దీన్నే వైకుంఠనాథుడి మెట్టగా పిలుస్తారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగుండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఏటా



మైక్రోటవర్ మార్గంలో రాళ్లు తేలిన రోడ్డుపై నడుస్తున్న భక్తులు

ఆరుద్ర కార్తెలో ఇక్కడి వైకుంఠవాసుడికి అభిషేకాలు చేస్తారు. ఆయన సన్నిధిలోనే పాయసాన్ని వండి సమీపంలో ఉన్న పొర్లుబండపై నుంచి జారవిడుస్తారు. దీన్నే వరద పాయసం సేవగా వ్యవహరిస్తారు. పొర్లుబండపై నుంచి జారిపడే ఆ పాయసాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా భావించి స్వీకరిస్తారు. ఇంతటి విశిష్టత కల్గిన వైకుంఠవాసుడికి మిగిలిన రోజుల్లో ధూపదీప నైవేద్యాలూ కరవేనంటే నమ్మితీరాల్సిందే.

పదేళ్ల క్రితం మరీ దారుణం

గతంలో వైకుంఠవాసుడికి ఆలయం ఉండేది. నిత్యం ధూపదీప నైవేద్యాలు జరిగేవి. సింహాచలం దేవస్థానానికి చెందిన కొంతమంది వైదికులు అక్కడ విధులు నిర్వర్తించేవారు. కాలక్రమంలో పట్టించుకునే నాథుడు లేక స్వామి ఆలయం, విగ్రహాలు శిథిలావస్థకు చేరాయి. పదేళ్ల కిందటి వరకు శిథిల విగ్రహాలకే పూలు చేసి, వరద పాయస సేవ నిర్వహించేవారు. పదేళ్ల క్రితం ఒక దాత సహకారంతో దేవస్థాన వైదికులే నూతన విగ్రహాల తయారీకి సంకల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠవాసుడి విగ్రహాలను తయారుచేయించి పునః ప్రతిష్టించారు. నూతన ఆలయం నిర్మాణం మాత్రం జరగలేదు. పదేళ్లుగా ఆలయం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని దేవస్థానం అధికారులు చెబుతూనే ఉన్నారు. గతంలో మాదిరి రాతితోనే ఆలయాన్ని పునర్నిర్మిస్తామని ఒకసారి, సిమెంట్‌తో మండపం నిర్మిస్తామని మరోసారి చెప్పుకొచ్చారు తప్ప.. కార్యాచరణకు నోచుకోలేదు.

ధూపదీపాలకూ దైన్యం

2022లో వైకుంఠవాసుడి సన్నిధిని పరిశీలించిన అప్పటి ఈవో ఎం.వి.సూర్యకళ ఆలయ దుస్థితిని తెలుసుకున్నారు. దీంతో దేవస్థానం అర్చకులు నిత్యం అక్కడికి వెళ్లి ఉదయం, సాయంత్రం ధూపదీప నైవేద్యాలు సమర్పించేలా ఆదేశించారు. దీంతో షిఫ్టుల పద్ధతిలో రోజూ అర్చకులు స్వామి సన్నిధిలో ధూపదీప నైవేద్యాలు పెట్టేవారు. అది కూడా కొన్ని రోజులకే పరిమితమైంది. ఈవో సూర్యకళ బదిలీ తర్వాత స్వామి వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఆ తర్వాత గత ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హయాంలో వైకుంఠవాసుడి ఆలయ నిర్మాణాన్ని నగరానికి చెందిన ఓ జ్యూయలరీ సంస్థ ముందుకొచ్చింది. ఆ సంస్థ సహకారంతో ప్రణాళిక చేశారు. అదికూడా ముందుకుసాగలేదు.

మూడు నెలలన్నారు.. ముహూర్తాల్లేవేమో..!

సింహగిరికి వచ్చే భక్తులంతా వైకుంఠవాసుడిని కూడా సందర్శించేలా ఒక విజిటింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణం, లైటింగ్, వాహనాలకు పార్కింగ్, టాయిలెట్లు, సెక్యూరిటీ తదితర ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఈ ఏడాది జూన్‌లో జరిగిన వరద పాయస సేవ సందర్భంగా స్వయంగా ఈవో శ్రీనివాసమూర్తే మీడియా ముఖంగా ప్రకటించారు. మూడు నెలల్లో పనులు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. దాదాపు ఐదు మాసాలవుతోంది. ఇప్పటికీ ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంచి ముహూర్తం దొరకలేదేమో..! అని భక్తుల గుసగుస.

వ్యూ పాయింట్ బాగుంది



మేము సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి వచ్చాం. దర్శనం అనంతరం చుట్టుపక్కల చూసేందుకు ఏం బాగుంటుందని ఇక్కడి వారిని అడిగితే వైకుంఠవాసుడి కొండపై నుంచి వ్యూ పాయింట్ బాగుంటుందని చెప్పారు. ఇక్కడి వైకుంఠవాసుడిని కూడా దర్శించుకున్నాం. ఆలయానికి వెళ్లే దారి చాలా దారుణంగా ఉంది. స్వామికి ఆలయం నిర్మించి కొత్తగా రోడ్డు వేస్తే బాగుంటుంది.

– నిరంజన్–గణేష్, శ్రీకాకుళం

దాతలు సిద్ధంగా ఉన్నారు



వైకుంఠవాసుడి నూతన ఆలయం నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నారు. వారి సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తాం. సంబంధిత ప్రణాళికకు వైదికుల ఆమోదం తీసుకుని ట్రస్ట్ బోర్డు తీర్మానానికి పెడతాం. తర్వాత కమిషనర్ ఆమోదం కోసం పంపిస్తాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ఆలయానికి వెళ్లే రోడ్డు, ఆలయం వద్ద అభివృద్ధి పనులకి కూడా ప్రణాళికలు రూపొందిస్తాం.

– శ్రీనివాసరాజు, ఈఈ, సింహాచలం దేవస్థానం

సింహాచలేశుని దర్శించుకున్న కలెక్టర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కలెక్టర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సింహగిరిపైనున్న కాటేజీలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజుతో పలు విషయాలపై కలెక్టర్ చర్చించారు. దేవస్థానం పంచగ్రామాల భూసమస్యకి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే ప్రత్యామ్నాయ స్థలం, ప్రసాద్ స్కీమ్ పనులపై మాట్లాడినట్లు తెలిసింది.

అప్పన్న సన్నిధిలో నాగూర్‌బాబు



కప్పస్తంభం వద్ద నాగూర్‌బాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ గాయకుడు నాగూర్‌బాబు(మనో) ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని బహూకరించారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. అనకాపల్లి, సబ్బవరం, లంకెలపాలెం, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, పరవాడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సముద్రం వద్దకు చేరుకుని ఆట పాటలతో సందడి చేశారు. చిన్నాపెద్దా కలిసి సరదాగా గడిపారు. సాయంత్రం వరకు తీరంలో జలకాలాడుతూ ఆనందించారు. అనంతరం సంతోషంగా తిరుగుముఖం పట్టారు.

వైభవంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

- పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజిపాలెంలో మరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు, కరుణతో ఈ ప్రాంత ప్రజలు సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ట వైభవంగా జరిగింది. తొలుత విఘ్నేశ్వరపూజ జరిపి, శుద్ధ పుణ్యాహవచనం, రక్షా బంధనం, మండపారాధన, ప్రధాన కలశారాధన, అంకురార్పణ, పంచగవ్యప్రాశన, యాగశాల ప్రవేశం వంటి పూజలు నిర్వహించారు. హోమాలు, మృత్సంగ్రహణం, దేవతాహ్వానం, పసిడికలశ ఊరేగింపు అనంతరం జలాధివాసం, క్షీరాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పములు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, గండి రవి కుమార్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, సబ్బవరపు నారాయణమూర్తి, బయలపూడి భగవాన్ జయరాం, రాపేటి రాము, కర్రి శ్రీనివాస్, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మామిడి కొండాజీ, ఎస్ దుర్గ, వనం అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మరిడిమాంబ సన్నిధిలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ముగిసిన వేంకటాద్రి పవిత్రోత్సవాలు





పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి , పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేసి.. గోత్రనామార్చనలు జరిపారు. స్వామి సన్నిధిలో హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిపారు. రుత్విక్ సన్మానంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలను ఈవో నీలిమ, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.ఎస్.రాజు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని ఈవో నీలిమ తెలిపారు.

గండి బాబ్జీకి అభినందనలు



గండి బాబ్జీని అభినందిస్తున్న నాయకులు

పెందుర్తి: రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవెర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీని పలువురు నాయకులు ఆదివారం అభినందించారు. మొగలిపురంలోని ఆయన నివాసంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణ రావు, స్థానిక నాయకులు దుక్కాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

1800 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

- పట్టుబడిన పీడీఎస్ బియ్యం

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి నరవలో నిల్వ ఉంచిన 1800 కిలోల పీడీఎస్ బియ్యాన్ని పెందుర్తి పోలీసులు, జిల్లా సివిల్ సప్లై అధికారులు ఆదివారం పట్టుకున్నారు. సబ్బవరం ప్రాంతానికి చెందిన కూన గోవిందరావు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి బ్రాండెడ్ సంచుల్లో వేసి అధిక ధరలకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో తను సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని నరవలోని ఓ గొడౌన్లో నిల్వ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, పౌరసరఫరాల అధికారులు దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గోవిందరావును అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ వెల్లడించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లైంట్స్ అయిన (1) అప్పలబత్తుల చిన్నబాబు, S/o. వరహాలు, (2) వన్నెంరెడ్డి హిమబిందు, W/o. అప్పలబత్తుల వెంకట రత్నం (3) గంట్రెడ్డి ప్రసాద్, S/o. అప్పారావు (4) రాంపల్లి జి.వి.ఎస్.ఆర్. కుమార్ S/o. జి.వి. నాగరాజు మరియు (5) వెలవలపల్లి ఎస్వీ దుర్గ ప్రసాద్ S/o. వి.వి.ఎల్.సుబ్రహ్మణ్యం గార్లు ఈ దిగువన ఉదహరించిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని మొగసాల వెంకటరావు మరియు మొగసాల వెంకట రాజ్యలక్ష్మి వార్ల నుండి కొనుగోలు చేయ నిశ్చయించినారు. కావున లోకులకు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు కాని ఆక్షేపణలు కాని ఉన్న యెడల తగిన సాక్ష్యాధారాలతో ఈ దిగువున ఇచ్చిన అడ్రస్ నందు వారం (7) దినములలోగా సంప్రదించవలెను. లేనియెడల సదరు షెడ్యూల్ దాఖలా స్థిరాస్తులు నిర్వివాదముగా భావించి నా క్లైంట్స్ కొనుగోలు చేసెదరు.

షెడ్యూల్ స్థిరాస్తి

విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం జుత్తాడ గ్రామములో గల సర్వే నెంబర్ 12/P, 67/P మరియు 68/Pలో గల వుడా లే ఔట్ నెంబర్ 19/1999లో గల (1) ప్లాట్ నెం. 10లో గల 267 చదరపు గజముల ఖాళీ స్థలం, (2) ప్లాట్ నెం. 11లో గల 267 చదరపు గజముల ఖాళీ స్థలం, (3) ప్లాట్ నెం.6లో గల 267 చదరపు గజముల ఖాళీ స్థలం మరియు (4) ప్లాట్ నెం.5లో గల 267 చదరపు గజముల ఖాళీ స్థలం.

కె.రవి శంకర్, న్యాయవాది
డోరు నెం. 12-487, శ్రీ రామ్ నగర్, రవీంద్రనగర్-II, ఓల్డ్ డైరీ ఫారం, విశాఖపట్నం - 530040
Ph: 93993 88999, 76710 34497
94944 00429
విశాఖపట్నం, తేదీ : 2-11-2024

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా వెల్లడి

- అభ్యంతరాలకు రెండు రోజులే గడువు

సబ్బవరం: ఏపీ ఫార్మర్ మేనేజ్‌మెంట్ అఫ్ ఇరిగేషన్ సిస్టమ్ యాక్ట్–1997 విధివిధానాల మేరకు సాగునీటి చెరువుల రైతు సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదివారం మీడియాకు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని 23 చెరువులకు సంబంధించి 138 ప్రాదేశిక నియోజకవర్గాల ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి సర్వే నెంబర్లు, విస్తీర్ణం, రైతులవారీగా వివరాలతో కూడిన ఓటర్ల జాబితాలను రూపొందించి, ఆయా గ్రామ సచివాలయాల్లో ఆదివారం ప్రదర్శించినట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే రెండు రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా కోరారు.

రాష్ట్ర స్థాయి 'చెకుముకి' విజేతలకు బహుమతుల ప్రదానం

పెందుర్తి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు 48 బృందాలుగా ఏర్పడ్డారు. విజువల్, మౌఖిక, క్విజ్, ప్రాక్టికల్, రాత పరీక్షల విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి బాపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా, విజయనగరం జిల్లా దినకడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, తిరుపతి జిల్లా స్పేస్ సెంటర్ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విభాగం నుంచి కర్నూలు సెయింట్ జోసెఫ్ స్కూల్ మొదటి, అనకాపల్లి శ్రీప్రకాష్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ, గుంటూరు జిల్లా కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి, బహుమతులు పొందారు. విజేతలకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు, శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు అందించారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు యాతపాలెంలోని మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి అధివాస మహోత్సవంలో ఒక్కోసారి ఒక్కో పత్రితో నిర్వహిస్తారు.



భువనేశ్వరీదేవికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవంలో ఈసారి శంఖు పత్రితో పూజించారు. ముందుగా అమ్మవారికి మంగళస్నానాలు చేయించి, అనంతరం నూతన వస్త్రాభరణాలతో అలంకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

శ్రీకృష్ణ ఆలయ ప్రారంభోత్సవం



స్వామివారి సన్నిధిలో ఎంపీ రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం: మండలంలోని అసకపల్లి శివారు ఎర్రవానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని కూటమి నేతలు, గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.